"మధురమైన పిల్లలూ - స్మృతి యాత్ర ద్వారానే మీ సంపాదన జమ అవుతుంది, మీరు నష్టము నుండి లాభములోకి వస్తారు, విశ్వానికి యజమానులుగా అవుతారు"

ప్రశ్న:- సత్యమైన సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది - దీని అర్థమేమిటి?

జవాబు:- ఎప్పుడైతే పిల్లలైన మీకు సత్యమైన సాంగత్యము అనగా తండ్రి యొక్క సాంగత్యము లభిస్తుందో, అప్పుడు మీరు ఎక్కే కళలోకి వెళ్తారు. రావణుని సాంగత్యము చెడు సాంగత్యము, అతడి సాంగత్యము వలన మీరు కిందకు పడిపోతారు అనగా రావణుడు మిమ్మల్ని ముంచేస్తాడు, తండ్రి తీరానికి చేరుస్తారు. తండ్రి యొక్క అద్భుతము ఏమిటంటే - ఒక్క క్షణంలో ఎటువంటి సాంగత్యాన్ని ఇస్తారంటే తద్వారా మీ గతి సద్గతి అవుతుంది, అందుకే వారిని ఇంద్రజాలికుడని కూడా అంటారు.

ఓం శాంతి. పిల్లలు స్మృతిలో కూర్చుని ఉన్నారు, దీనినే స్మృతి యాత్ర అని అంటారు. తండ్రి అంటారు - యోగము అన్న పదాన్ని ఉపయోగించకండి. తండ్రిని స్మృతి చేయండి, వారు ఆత్మలకు తండ్రి, పరమపిత, పతిత-పావనుడు. ఆ పతిత-పావనుడినే స్మృతి చేయాలి. తండ్రి అంటారు - దేహపు సర్వ సంబంధాలనూ వదిలి ఒక్క తండ్రినే స్మృతి చేయండి. మీరు మరణిస్తే మీకు సంబంధించినంత వరకు ప్రపంచం మరణించినట్లే... అని అంటారు కదా. దేహ సహితంగా దేహపు సర్వ సంబంధాలు మొదలైనవేవైతే కనిపిస్తాయో, వాటిని స్మృతి చేయకండి. ఒక్క తండ్రినే స్మృతి చేసినట్లయితే మీ పాపాలు భస్మమైపోతాయి. మీరు జన్మ-జన్మాంతరాల పాపాత్ములు కదా. ఇది ఉన్నదే పాపాత్ముల ప్రపంచము. సత్యయుగము పుణ్యాత్ముల ప్రపంచము. ఇప్పుడు పాపాలన్నీ తొలగి పుణ్యము ఎలా జమ అవుతుంది? తండ్రి యొక్క స్మృతి ద్వారానే జమ అవుతుంది. ఆత్మలోనే మనస్సు, బుద్ధి ఉన్నాయి కదా. కావున ఆత్మను బుద్ధి ద్వారా స్మృతి చేయాలి. తండ్రి అంటారు - మీ మిత్ర-సంబంధీకులు ఎవరైతే ఉన్నారో, వారందరినీ మర్చిపోండి. వారంతా ఒకరికొకరు దుఃఖాన్ని ఇచ్చుకుంటారు. ఒక పాపం ఏమి చేస్తారంటే - కామ వికారాన్ని నడిపిస్తారు, ఇంకొక పాపం ఏం చేస్తారు? తండ్రి ఎవరైతే సర్వుల సద్గతిదాతనో, పిల్లలకు అనంతమైన సుఖాన్ని ఇస్తారో అనగా స్వర్గాధిపతులుగా తయారుచేస్తారో, వారిని సర్వవ్యాపి అని అనేస్తారు. ఇది పాఠశాల, మీరు ఇక్కడకు చదువుకోవడానికి వచ్చారు. ఈ విధంగా లక్ష్మీ-నారాయణులుగా అవ్వడము మీ లక్ష్యము-ఉద్దేశ్యము. ఇంకెవ్వరూ ఈ విధంగా చెప్పలేరు. మీకు తెలుసు - ఇప్పుడు మనము పవిత్రముగా అయి పవిత్ర ప్రపంచానికి అధిపతులుగా అవ్వాలి. మనమే విశ్వానికి యజమానులుగా ఉండేవారము. పూర్తి 5,000 సంవత్సరాలు గడిచాయి. దేవీ-దేవతలు విశ్వానికి యజమానులు కదా. అది ఎంతటి ఉన్నతమైన పదవి. తప్పకుండా ఆ విధంగా తండ్రియే తయారుచేస్తారు. తండ్రినే పరమాత్మ అని అంటారు, వారి అసలైన పేరు శివ, ఆ తర్వాత ఎన్నో పేర్లు పెట్టేసారు. ఎలాగైతే బొంబేలో బబుల్ నాథ్ మందిరము ఉంది అనగా ముళ్ళ అడవిని పుష్పాల తోటగా తయారుచేసేవారు అని అర్థము. లేకపోతే వారి అసలైన పేరు కేవలం 'శివ' మాత్రమే, వీరిలోకి ప్రవేశించిన తర్వాత కూడా వారికి శివ అన్న పేరే ఉంటుంది. మీరు ఈ బ్రహ్మను స్మృతి చేయకూడదు, వీరైతే దేహధారి. మీరు విదేహిని స్మృతి చేయాలి. మీ ఆత్మ పతితముగా అయ్యింది, దానిని పావనముగా తయారుచేసుకోవాలి. మహాన్ ఆత్మ, పాపాత్మ అని కూడా అంటారు. మహాన్ పరమాత్మ అని అనరు. స్వయాన్ని పరమాత్మ అని లేక ఈశ్వరుడు అని కూడా ఎవ్వరూ చెప్పుకోలేరు. మహాత్మ, పవిత్ర ఆత్మ అని కూడా అంటారు. సన్యాసులు సన్యసిస్తారు అందుకే వారు పవిత్ర ఆత్మలు. తండ్రి అర్థం చేయించారు - వారందరూ కూడా పునర్జన్మలు తీసుకుంటారు. దేహధారులు తప్పకుండా పునర్జన్మలు తీసుకోవాల్సి ఉంటుంది. వికారాల ద్వారా జన్మ తీసుకొని మళ్ళీ ఎప్పుడైతే పెద్దవారిగా అవుతారో అప్పుడిక సన్యాసం చేస్తారు. దేవతలైతే ఈ విధంగా చేయరు. వారైతే సదా పవిత్రమైనవారు. తండ్రి ఇప్పుడు మిమ్మల్ని అసురత్వం కలవారి నుండి దైవత్వం కలవారిగా తయారుచేస్తారు, దైవీ గుణాలను ధారణ చేయడం ద్వారా దైవీ సాంప్రదాయానికి చెందినవారిగా అవుతారు. దైవీ సాంప్రదాయం వారు సత్యయుగములో ఉంటారు, అసురీ సాంప్రదాయం వారు కలియుగములో ఉంటారు. ఇప్పుడు ఇది సంగమయుగము. ఇప్పుడు మీకు తండ్రి లభించారు, వారంటారు - ఇప్పుడు మీరు మళ్ళీ దైవీ సాంప్రదాయం కలవారిగా తప్పకుండా అవ్వాలి. మీరు ఇక్కడకు దైవీ సాంప్రదాయం కలవారిగా అయ్యేందుకే వచ్చారు. దైవీ సాంప్రదాయం వారికి అపారమైన సుఖము ఉంటుంది. ఈ ప్రపంచాన్ని హింసాయుతమైనదని అంటారు, దేవతలు అహింసకులు.

తండ్రి అంటారు - మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలూ, తండ్రిని స్మృతి చేయండి. మీ గురువులు ఎవరైతే ఉన్నారో,

వారందరూ కూడా దేహధారులే. ఇప్పుడు ఆత్మలైన మీరు పరమాత్మ అయిన తండ్రిని స్మృతి చేయాలి. ఎప్పుడైతే మీరు పుణ్యాత్మగా అవుతారో, అప్పుడే సుఖం లభిస్తుంది. 84 జన్మల తర్వాతనే మీరు పాపాత్ములుగా అవుతారు. ఇప్పుడు మీరు పుణ్యం జమ చేసుకుంటారు, యోగబలం ద్వారా పాపాలను సమాప్తం చేసుకుంటారు. ఈ స్మృతి యాత్ర ద్వారానే మీరు విశ్వాధిపతులుగా అవుతారు. మీరు విశ్వాధిపతులుగా ఉండేవారు అన్నది అయితే సరైన విషయమే కదా. వారు మళ్ళీ ఎక్కడికి వెళ్ళారు అన్నది కూడా తండ్రియే తెలియజేస్తారు. మీరు 84 జన్మలను తీసుకున్నారు, సూర్యవంశీయులుగా-చంద్రవంశీయులుగా అయ్యారు. భక్తి ఫలాన్ని భగవంతుడు ఇస్తారని కూడా అంటారు. భగవంతుడు అని దేహధారిని ఏమీ అనరు. వారు నిరాకారుడైన శివుడు. వారి శివరాత్రిని జరుపుకుంటారు అంటే వారు తప్పకుండా వస్తారనే కదా. కానీ వారంటారు - నేను మీ వలె జన్మ తీసుకోను, నేను శరీరాన్ని అప్పుగా తీసుకోవలసి ఉంటుంది. నాకు నా శరీరమంటూ లేదు, ఒకవేళ ఉన్నట్లయితే దానికి పేరు ఉంటుంది. బ్రహ్మా అన్న పేరైతే వీరిది వీరికి ఉంది. వీరు సన్యాసాన్ని స్వీకరించారు, అప్పుడు వారికి బ్రహ్మా అన్న పేరును పెట్టారు. మీరు బ్రహ్మాకుమారులు-కుమారీలు. లేకపోతే మరి బ్రహ్మా ఎక్కడి నుండి వచ్చారు? బ్రహ్మా శివుని సంతానము. శివబాబా తన సంతానమైన బ్రహ్మాలోకి ప్రవేశించి మీకు జ్ఞానాన్ని ఇస్తారు. బ్రహ్మా, విష్ణు, శంకరులు కూడా వీరి పిల్లలు. నిరాకారుడైన తండ్రి యొక్క పిల్లలందరూ నిరాకారులే. ఆత్మలు ఇక్కడికి వచ్చి శరీరాన్ని ధారణ చేసి పాత్రను అభినయిస్తారు. తండ్రి అంటారు - నేను పతితులను పావనంగా తయారుచేయడానికే వస్తాను. నేను ఈ శరీరాన్ని అప్పుగా తీసుకుంటాను. శివ భగవానువాచ ఉంది కదా. శ్రీకృష్ణుడినైతే భగవంతుడు అని అనలేరు. భగవంతుడైతే ఒక్కరే. శ్రీకృష్ణుని మహిమయే వేరు. మొదటి నంబరు దేవతలు రాధా-కృష్ణులు, వారే స్వయంవరం తర్వాత మళ్ళీ లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. కానీ ఇది ఎవ్వరికీ తెలియదు. రాధా-కృష్ణుల గురించి ఎవ్వరికీ కూడా తెలియదు, వారు మళ్ళీ ఎక్కడికి వెళ్తారు? రాధా-కృష్ణులే స్వయంవరం తర్వాత మళ్ళీ లక్ష్మీ-నారాయణులుగా అవుతారు. వారు ఇరువురూ వేర్వేరు మహారాజుల పిల్లలు. అక్కడ అపవిత్రత అన్న మాటే ఉండదు ఎందుకంటే 5 వికారాల రూపీ రావణుడే ఉండడు. అది ఉన్నదే రామ రాజ్యము. ఇప్పుడు తండ్రి ఆత్మలకు చెప్తారు - నన్ను స్మృతి చేసినట్లయితే మీ పాపాలు తొలగిపోతాయి. మీరు సతోప్రధానముగా ఉండేవారు, ఇప్పుడు తమోప్రధానముగా అయ్యారు, నష్టం కలిగింది, మళ్ళీ జమ చేసుకోవాలి. భగవంతుడిని వ్యాపారస్తుడు అని కూడా అంటారు. ఎవరో అరుదుగా వారితో వ్యాపారం చేస్తారు. ఇంద్రజాలికుడు అని కూడా వారిని అంటారు, వారు అద్భుతం చేస్తారు, మొత్తం ప్రపంచమంతటికీ సద్గతిని ఇస్తారు. అందరికీ ముక్తి-జీవన్ముక్తులను ఇస్తారు. ఇది ఇంద్రజాలం యొక్క ఆట కదా. దీనిని మనుష్యులు మనుష్యులకు ఇవ్వలేరు. మీరు 63 జన్మల నుండి భక్తి చేస్తూ వచ్చారు, ఈ భక్తి ద్వారా ఎవరైనా సద్గతిని పొందారా? సద్గతిని ఇచ్చేవారు ఎవరైనా ఉన్నారా? ఎవ్వరూ ఉండరు. ఒక్కరు కూడా తిరిగి వెళ్ళలేరు. అనంతమైన తండ్రియే వచ్చి అందరినీ తిరిగి తీసుకువెళ్తారు. కలియుగములో అనేకమంది రాజులు ఉన్నారు. అక్కడ మీరు కొద్దిమందే రాజ్యము చేస్తారు. మిగిలిన ఆత్మలందరూ ముక్తిలోకి వెళ్ళిపోతారు. మీరు ముక్తిధామం నుండి జీవన్ముక్తిలోకి వెళ్తారు. ఈ చక్రము తిరుగుతూ ఉంటుంది. ఇప్పుడు ఆత్మలైన మీకు ఈ సృష్టిచక్రము, రచయిత మరియు రచనల ఆదిమధ్యాంతాల దర్శనము జరిగింది. మీరే ఈ జ్ఞానము ద్వారా నరుడి నుండి నారాయణుడిగా అవుతారు. దేవతల రాజధాని యొక్క స్థాపన జరిగిన తర్వాత ఇక మీకు జ్ఞానం యొక్క అవసరం ఉండదు. భక్తులకు భగవంతుడు అర్ధకల్పం కొరకు సుఖము యొక్క ఫలాన్ని ఇచ్చారు, మళ్ళీ రావణ రాజ్యములో దుఃఖము ప్రారంభమవుతుంది. నెమ్మదిగా-నెమ్మదిగా మెట్లు దిగుతారు. మీరు సత్యయుగములో ఉన్నప్పటికీ కూడా ఒక్క రోజు ఏదైతే గడుస్తుందో, ఆ తర్వాత మెట్లు దిగవలసి ఉంటుంది. మీరు 16 కళల సంపూర్ణులుగా అవుతారు, మళ్ళీ మెట్లు దిగుతూనే ఉంటారు. క్షణ-క్షణమూ టిక్-టిక్ అంటూ ఉంటుంది. అలా దిగిపోతూనే ఉంటారు. సమయం గడుస్తూ-గడుస్తూ ఈ స్థానానికి వచ్చి చేరుకున్నారు. అక్కడ కూడా ఈ విధంగానే ఘడియలు గడుస్తూ ఉంటాయి. మనం ఒక్కసారిగా మెట్లు పైకి ఎక్కేస్తాము. మళ్ళీ పేను వలె మెట్లు దిగాల్సి ఉంటుంది.

తండ్రి అంటారు - నేను సర్వులకు సద్గతిని ఇచ్చేవాడను. మనుష్యులు, మనుష్యులకు సద్గతిని ఇవ్వలేరు ఎందుకంటే వారు వికారాల ద్వారా జన్మిస్తారు, పతితులుగా ఉంటారు. వాస్తవానికి శ్రీకృష్ణుడినే సత్యమైన మహాత్మ అని అనవచ్చు. ఈ మహాత్ములైతే వికారాల ద్వారా జన్మ తీసుకొని మళ్ళీ సన్యాసాన్ని స్వీకరిస్తారు. వారైతే దేవతలు. దేవతలైతే సదా పవిత్రమైనవారు. వారిలో ఎటువంటి వికారాలూ ఉండవు. దానిని నిర్వికారీ ప్రపంచము అని అంటారు, దీనిని వికారీ ప్రపంచము అని అంటారు. ఇక్కడ పవిత్రత లేదు. నడవడిక ఎంత అశుద్ధముగా ఉంది. దేవతల నడవడిక అయితే చాలా బాగుంటుంది. అందరూ వారికి నమస్కరిస్తారు. వారి క్యారెక్టర్స్ (గుణాలు) చాలా బాగుంటాయి అందుకే అపవిత్రమైన మనుష్యులు ఆ పవిత్రమైన దేవతల ఎదురుగా తల వంచి నమస్కరిస్తారు. ఇప్పుడైతే గొడవలు-కొట్లాటలు

ఏమేమి జరుగుతున్నాయి. చాలా హంగామా ఉంటుంది. ఇప్పుడైతే ఉండడానికి కూడా స్థానము లేదు. మనుష్యుల సంఖ్య తక్కువగా ఉండాలని కోరుకుంటారు. కానీ ఇదైతే తండ్రి పనే. సత్యయుగములో చాలా కొద్దిమంది మనుష్యులు ఉంటారు. ఈ శరీరాలన్నీ కాలిపోతాయి, ఇక మిగిలిన ఆత్మలన్నీ తమ మధురమైన ఇంటికి వెళ్ళిపోతాయి. శిక్షలనైతే నంబరువారుగా తప్పకుండా అనుభవిస్తారు. ఎవరైతే పూర్తిగా పురుషార్థము చేసి విజయమాలలోని మణులుగా అవుతారో, వారు శిక్షల నుండి విముక్తులవుతారు. మాల అనేది ఒక్కరిదే ఉండదు. ఎవరైతే వారిని ఈ విధంగా తయారుచేసారో, వారు పుష్పము. ఆ తర్వాత జంట పూస ఉంటుంది, ఇది ప్రవృత్తి మార్గము కదా. కావున ఇది జోడి యొక్క మాల, సింగిల్ మాల ఉండదు. సన్యాసుల మాల ఉండదు. వారు నివృత్తి మార్గం వారు. వారు ప్రవృత్తి మార్గం వారికి జ్ఞానాన్ని ఇవ్వలేరు. పవిత్రంగా అయ్యేందుకు వారిది హద్దు సన్యాసము, వారు హఠయోగులు. ఇది రాజయోగము, రాజ్యాన్ని పొందేందుకు తండ్రి మీకు ఈ రాజయోగాన్ని నేర్పిస్తారు. తండ్రి ప్రతి 5,000 సంవత్సరాల తర్వాత వస్తారు. మీరు అర్ధకల్పం సుఖములో రాజ్యము చేస్తారు, ఆ తరువాత రావణ రాజ్యములో మెల్ల-మెల్లగా మీరు దుఃఖితులుగా అవుతారు. దీనిని సుఖ-దుఃఖాల ఆట అని అంటారు. పాండవులైన మీకు విజయాన్ని ప్రాప్తింపజేస్తారు. ఇప్పుడు మీరు మార్గదర్శకులు. ఇంటికి వెళ్ళే యాత్రను చేయిస్తారు. ఆ యాత్రలనైతే మనుష్యులు జన్మ-జన్మాంతరాలూ చేస్తూ వచ్చారు. ఇప్పుడు మీ యాత్ర ఇంటికి వెళ్ళడం కోసము. తండ్రి వచ్చి అందరికీ ముక్తి-జీవన్ముక్తుల మార్గాన్ని తెలియజేస్తారు. మీరు జీవన్ముక్తిలోకి వెళ్తారు, మిగిలినవారంతా ముక్తిలోకి వెళ్తారు. హాహాకారాల తర్వాత మళ్ళీ జయజయకారాలు జరుగుతాయి. ఇప్పుడిది కలియుగం యొక్క అంతిమము. ఆపదలైతే ఎన్నో రానున్నాయి, మళ్ళీ ఆ సమయంలో మీరు స్మృతి యాత్రలో ఉండలేరు ఎందుకంటే ఎన్నో గొడవలు జరుగుతాయి, అందుకే తండ్రి అంటారు - ఇప్పుడు స్మృతి యాత్రను పెంచుతూ వెళ్ళండి తద్వారా పాపాలు భస్మమవుతాయి మరియు జమ కూడా చేసుకోండి. సతోప్రధానంగా అయితే అవ్వండి. తండ్రి అంటారు - నేను ప్రతి కల్పం యొక్క పురుషోత్తమ సంగమయుగములో వస్తాను. ఇదైతే చాలా చిన్నని బ్రాహ్మణుల యుగము. బ్రాహ్మణులకు గుర్తుగా పిలక ఉంటుంది. బ్రాహ్మణ, దేవత, క్షత్రియ, వైశ్య, శూద్ర - ఈ చక్రము తిరుగుతూనే ఉంటుంది. బ్రాహ్మణుల కులము చాలా చిన్నది, ఈ చిన్న యుగములో తండ్రి వచ్చి మిమ్మల్ని చదివిస్తారు. మీరు పిల్లలు కూడా, అలాగే విద్యార్థులు కూడా, ఫాలోవర్స్ కూడా. మీరు ఒక్కరికి చెందినవారు. ఈ విధంగా తండ్రిగా, శిక్షణను ఇచ్చే టీచర్ గా, సృష్టి యొక్క ఆదిమధ్యాంతాల జ్ఞానాన్ని ఇచ్చేవారు మరియు తమతోపాటు తీసుకువెళ్ళే మనుష్యులు అంటూ ఎవరూ ఉండరు. ఇటువంటి మనుష్యులు ఎవ్వరూ ఉండరు. ఈ విషయాలను ఇప్పుడు మీరు అర్థం చేసుకుంటారు. సత్యయుగములో కూడా మొట్టమొదట చాలా చిన్న వృక్షము ఉంటుంది, మిగిలినవారంతా శాంతిధామములోకి వెళ్ళిపోతారు. తండ్రిని సర్వుల సద్గతిదాత అని అంటారు. ఓ పతిత-పావనమైన తండ్రి, రండి అని తండ్రిని పిలుస్తారు. ఇంకొకవైపేమో - పరమాత్మ కుక్కలో-పిల్లిలో, రాయి-రప్పలన్నింటిలోనూ ఉన్నారు అని అంటారు. అనంతమైన తండ్రికి అపకారము చేస్తారు. తండ్రి ఎవరైతే విశ్వానికి యజమానులుగా తయారుచేస్తారో, వారిని అవమానిస్తారు. దీనినే రావణుడి సాంగత్య దోషము అని అంటారు. సత్యమైన సాంగత్యము తీరానికి చేరుస్తుంది, చెడు సాంగత్యము ముంచేస్తుంది. రావణ రాజ్యము ప్రారంభమైతే మీరు కింద పడిపోతూ ఉంటారు. తండ్రి వచ్చి మిమ్మల్ని ఎక్కే కళలోకి తీసుకువెళ్తారు. తండ్రి వచ్చి మనుష్యులను దేవతలుగా తయారుచేస్తారు తద్వారా సర్వులకు మేలు జరుగుతుంది. ఇప్పుడైతే అందరూ ఇక్కడే ఉన్నారు, మిగిలినవారు ఎవరైతే ఉన్నారో, వారు వస్తూ ఉంటారు. ఎప్పటివరకైతే నిరాకారీ ప్రపంచము నుండి ఆత్మలందరూ వస్తూ ఉంటారో, అప్పటివరకూ మీరు పరీక్షలలో కూడా నంబరువారుగానే పాస్ అవుతూ ఉంటారు. దీనిని ఆత్మిక కాలేజీ అని అంటారు. ఆత్మిక తండ్రి ఆత్మిక పిల్లలను చదివించడానికి వస్తారు, రావణ రాజ్యము రావడంతోనే శరీరాన్ని వదిలి అపవిత్రమైన రాజులుగా అయ్యారు మరియు పవిత్రమైన దేవతల ఎదురుగా తల వంచి నమస్కరించడం మొదలుపెట్టారు. ఆత్మయే పతితముగా మరియు పావనముగా అవుతుంది. ఆత్మ పతితముగా ఉంటే శరీరము కూడా పతితమైనదే లభిస్తుంది. సత్యమైన బంగారములో మాలిన్యం చేరుకుంటే అది మాలిన్యం కల నగగా అవుతుంది. ఇప్పుడు ఆత్మ నుండి మాలిన్యము ఎలా తొలగుతుంది? యోగాగ్ని అవసరము, దాని ద్వారా మీ వికర్మలు వినాశనమవుతాయి. ఆత్మలో వెండి, రాగి, లోహము మొదలైనవి కలిసాయి. ఇది మాలిన్యము. ఆత్మ సత్యమైన బంగారము. ఇప్పుడు అసత్యమైనదిగా అయిపోయింది. ఆ మాలిన్యం ఎలా తొలగుతుంది? ఇది యోగాగ్ని, మీరు జ్ఞాన చితిపై కూర్చుని ఉన్నారు. ఇంతకు ముందు కామ చితిపై ఉండేవారు. తండ్రి జ్ఞానచితిపై కూర్చోబెడతారు. జ్ఞానసాగరుడైన తండ్రి తప్ప ఇంకెవ్వరూ జ్ఞానచితిపై కూర్చోబెట్టలేరు. మనుష్యులు భక్తి మార్గములో ఎన్ని పూజలు చేస్తూ ఉంటారు కానీ వారికి ఎవ్వరి గురించి తెలియదు. ఇప్పుడు మీరు అందరినీ తెలుసుకున్నారు. మీరందరూ దేవతలుగా అయితే ఇక పూజ యొక్క విషయమే సమాప్తమైపోతుంది. ఎప్పుడైతే

రావణరాజ్యము ప్రారంభమవుతుందో అప్పుడు భక్తి ప్రారంభమవుతుంది. అచ్చా!

మధురాతి-మధురమైన ఆత్మిక పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. శిక్షల నుండి ముక్తులుగా అయ్యేందుకు విజయమాలలోని మణులుగా అయ్యే పురుషార్థము చేయాలి, ఆత్మిక మార్గదర్శకునిగా అయి అందరితో శాంతిధామమైన ఇంటి యొక్క యాత్రను చేయించాలి.

2. స్మృతి యాత్రను పెంచుతూ-పెంచుతూ అన్ని పాపాల నుండి ముక్తులుగా అవ్వాలి. యోగాగ్నితో ఆత్మను సత్యమైన బంగారముగా తయారుచేయాలి, సతోప్రధానముగా అవ్వాలి.

వరదానము:- ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ సదా ఎవర్రెడీగా ఉండే తీవ్ర పురుషార్థీ భవ

మన అంతిమ ఘడియకు ఎటువంటి భరోసా లేదు అందుకే ప్రతి ఘడియను అంతిమ ఘడియగా భావిస్తూ ఎవర్రెడీగా ఉండండి. ఎవర్రెడీగా అనగా తీవ్ర పురుషార్థులు. ఇప్పుడైతే వినాశనమవ్వడానికి కొద్ది సమయం పడుతుంది, అప్పుడు తయారైపోతాము అని ఈ విధంగా భావించకండి. అలా కాదు. ప్రతి ఘడియ అంతిమ ఘడియ అందుకే సదా నిర్మోహిగా, నిర్వికల్పంగా, నిర్వ్యర్థంగా ఉండండి... వ్యర్థం కూడా ఉండకూడదు, అప్పుడు ఎవర్రెడీ అని అంటారు. ఏ కార్యము మిగిలి ఉన్నా కానీ మీ స్థితి సదా ఉపరామంగా ఉండాలి, ఏది జరిగినా మంచే జరుగుతుంది.

స్లోగన్:- తమ చేతిలోకి లా ను (చట్టాన్ని) తీసుకోవడం కూడా క్రోధం యొక్క అంశము.